క్లుప్తంగా

అన్నసమారాధన



షిరిడీ సాయిబాబా మందిరం వద్ద అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక 43వ డివిజన్ కొత్తపేటలోని గిలకలగేటు సెంటర్‌లో శ్రీ షిరిడీ సాయి బాబా మందిరం 31వ వార్షికోత్స వాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమంలో సుమారు 2 వేల మంది భక్తులు పాల్గొని బాబా ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని మందిరం అభివృద్ధి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

ఘనంగా హాసం క్లబ్ వార్షికోత్సవం



హాసం క్లబ్ కన్వీనర్ జీఎస్‌ఆర్ శర్మ దంపతులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన హాసం క్లబ్ వార్షికోత్సవం ఆదివారం స్థానిక రామచంద్రరావు పేట మార్కండేయ వేద పాఠశాలలో ఘనంగా జరిగింది. తొలుత సభ్యులు హాస్యపూరితంగా జోకులు చెప్పి నవ్వించారు. అనంతరం వివిధ సినిమాల్లోని హాస్యపు సన్నివేశాలను గుర్తు చేసి సభికులకు వినోదం పంచారు. దివంగత నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన నటించిన వివిధ చిత్రాల్లోని పాటలను కొంతమంది సభ్యులు శ్రావ్యంగా ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హాసం క్లబ్ కన్వీనర్ జీఎస్‌ఆర్ శర్మ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.బాబి, శ్రీహరి కోటి, ఏ.మహిధర్, ఎస్.చంద్ర, పల్లా గంగాధర చయనులు, టి.శుభ తదితరులు పాల్గొన్నారు.

14 మందిపై కేసు నమోదు

దెందులూరు : ఇటీవల కొమిరేపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో సతీష్ అనే వ్యక్తి మృతి చెందిన ఘటనలో హైవే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి పోలీసుల విధులకు ఆటంకపరిచిన 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని
- నగరంలోని 43, 44 డివిజన్లలో గడపగడపకు మన ప్రభుత్వం



ఏలూరు 44వ డివిజన్‌లో వృద్ధురాలి సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేద వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 90వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఏలూరు కొత్తపేట నూకాలమ్మ గుడి రోడ్డు ప్రాంతం నుంచి ఎమ్మెల్యే నాని పాదయాత్రగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. 44వ డివిజన్ కార్పొరేటర్ పొలిమేర రామదాసు, 43వ డివిజన్ కార్పొరేటర్ జనపరెడ్డి కనకశ్రీ రాజేశ్వరి, పార్టీ నాయకులు జనపరెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆళ్ల నానికి డివిజన్‌లోని నాయకులు, ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేవా అని ఆరా తీశారు. ఏదైనా సాంకేతిక లోపంతో అర్హులు సంక్షేమ పథకాలకు దూరమైతే వెంటనే వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థానికంగా పలువురు మహిళలు సమస్యలు ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకువెళ్లగా వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే మహమ్మారి కరోనా ప్రజలను అతలాకుతలం చేసిందని గుర్తు చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలపై ప్రభావం పడకుండా అండగా నిలిచారని తెలిపారు. సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తూ పేదవర్గాల కుటుంబాల జీవనానికి తోడుగా నిలిచారన్నారు. కరోనా చికిత్సను ఆరోగ్యశ్రీలో చేర్చుతూ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారన్నారు. ఇవన్నీ చేస్తూనే మరోవైపు రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తూ పక్కాగా అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలంతా మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపాలని కోరారు.

వైఎస్సార్ సీపీలోకి కాంగ్రెస్ నేత పితాని చేరిక

గడపగడపకు కార్యక్రమంలో పర్యటిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ పితాని గంగాధర్, ఆయన కుమారుడు పితాని నాగవాసు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. మహానేత వైఎస్సార్ అంటే అమితమైన అభిమానం కలిగిన పితాని గంగాధర్ ఎమ్మెల్యే నాని పట్ల అభిమానంతో పార్టీలో విధేయత, క్రమశిక్షణతో ఉంటూ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, బందారు కిరణ్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు నున్న స్వాతి శ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, ఇనపనూరి కేదారేశ్వరి, భీమవరపు హేమసుందరి, అర్జి సత్యవతి, గరికిముక్కు జయకర్, దేవరకొండ శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్, పార్టీ నాయకులు తోటకూర కిషోర్, లూటుకుర్తు సుభాష్, పిట్టా ధనుంజయ్, యల్లాపు మోజెస్, వైఎస్వీ శివరావు, నిడికొండ నరేంద్ర, బాలత్రిపుర సుందరి, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, పీవో కృష్ణమూర్తి, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, తహసీల్దార్ సోమశేఖర్, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరాహార దీక్షకు మద్దతు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు సాధించుకునేందుకు విద్యార్థి సంఘాలు సోమవారం నుంచి చేపట్టనున్న నిరాహార దీక్షకు తన మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల స్థాపించి 15 ఏళ్లు గడుస్తున్నప్పటికీ స్థలం కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. అనేక విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా 2008లో డిగ్రీ కళాశాల మంజూరైందని, అప్పటి నుంచి ఎన్ని ప్రాతినిధ్యాలు చేసినప్పటికీ భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదన్నారు. జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆ కళాశాల భవనంలో సర్దుకుని తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అనేక సార్లు ఉన్నతాధికారులకు, మంత్రుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేదన్నారు. ఏలూరులో ఇప్పటివరకు ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలుగా ఉన్న సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల, సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం ఎయిడెడ్ ఉపసంహరించుకోవడంతో ప్రైవేట్ కళాశాలలుగా మారిపోయాయని, దీంతో పేద విద్యార్థులకు డిగ్రీ చదివే అవకాశం ఉన్న ఏకైక కళాశాలగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక్కటే అందుబాటులో ఉందన్నారు. విద్యార్థుల ఆందోళనలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.

కంటి వ్యాధులపై అప్రమత్తత అవసరం



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కంటికి సంబంధించిన వ్యాధులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని పరమహంస యోగానంద నేత్ర వైద్యశాలకు చెందిన వైద్య నిపుణులు సూచించారు. ఆదివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వ్యాపారవేత్త వీవీ బాలకృష్ణారావు సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వ్యాధులకు సంబంధించి ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి కంటి చూపును పరిరక్షించుకోవాలన్నారు. లేని పక్షంలో కంటి చూపునకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ శిబిరంలో 165 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో 24 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి తగిన ఏర్పాటు చేశారు. అలాగే మరో 36 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. చెన్నా వెంకట్రామయ్య, అల్లం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఓటీఎస్‌తో ఆస్తిపై సర్వహక్కులు

- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని
- 54 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని పంపిణీ చేసిన ఓటీఎస్ పట్టాలను చూపుతున్న లబ్ధిదారులు



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని. చిత్రంలో ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, నాయకులు బలరామ్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ప్రతి పేదవాడికీ సొంత ఆస్తి ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానంతో ఎంతో మేలు జరిగిందని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నగరానికి చెందిన సుమారు 54 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌తో ఎంతోమంది లబ్ధిపొందగా తాజాగా మరికొందరు ఈ పథకంలో మేలు పొందారు. సుమారుగా రూ.70 వేల నుంచి రూ.1లక్ష వరకు రుణాలు తీసుకోగా కేవలం రూ.20 వేలు మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి పూర్తిస్థాయిలో ఆ స్థలాలపై హక్కులు పొందేలా ఓటీఎస్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. ఏలూరు నగరంలోని 46వ డివిజన్‌లో ముగ్గురు, 6, 9వ డివిజన్లలో 26 మంది, 29వ డివిజన్‌లో ముగ్గురు, 27వ డివిజన్‌లో ఐదుగురు, ఒకటో డివిజన్‌లో నలుగురు, 29, 49 డివిజన్లలో ఇద్దరు చొప్పున, 24వ డివిజన్‌లో ముగ్గురు, 15వ డివిజన్‌లో నలుగురు, 32వ డివిజన్‌లో ఇద్దరు చొప్పున ఓటీఎస్‌లో పట్టాలు అందుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ రాష్ట్రంలో పేదవర్గాల ప్రజలకు మేలు చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా ఓటీఎస్ పథకాన్ని అమలు చేశారని చెప్పారు. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థల పట్టాలు తీసుకున్న పేదవర్గాల వారు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వాటిని చెల్లించలేక నేటికీ అప్పు పేరుకుపోయి ఉందనీ, అప్పు ఎంత ఉన్నా రూ.20 వేలు చెల్లిస్తే స్థలాలపై పూర్తిస్థాయి హక్కులు కల్పిస్తూ ఓటీఎస్ అమలు చేశారని తెలిపారు. అనేక మంది పేదలు వాటిని చెల్లించటంతో సర్వహక్కులు వాటిపై పొందే అవకాశం ఏర్పడిందన్నారు. ఏలూరు నగరంలో ఇప్పటికే అనేకమంది ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోగా, తాజాగా 54 మంది లబ్ధిదారులకు ఓటీఎస్‌లో మేలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, తహసీల్దార్ సోమశేఖర్, ఆయా డివిజన్ కార్పొరేటర్లు ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ఏలూరు టౌన్: వేసవి తాపానికి నీరసించిపోయే పరిస్థితుల్లో మజ్జిగ చలివేంద్రంతో ప్రజలు ఉపశమనం పొందుతారని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు పడమరవీధి గాంధీ మైదానం సమీపంలో మధ్యాహ్నపు రామకృష్ణదాస్, ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి దంపతుల ఆధ్వర్యంలో మధ్యాహ్నపు అనసూయమ్మ జ్ఞాపకార్థం ఆదివారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ వేసవిలో ప్రజలు, బాటసారులు, కార్మికుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, రైల్వే బోర్డు మెంబర్ వి.వెంకటేశ్వరరావు, 17వ డివిజన్ కార్పొరేటర్ పాము పద్మ, శామ్యూల్, పడమరవీధి వెంకటేశ్వరస్వామి గుడి చైర్‌పర్సన్ రాళ్ళపల్లి మహాలక్ష్మి, పార్టీ నాయకులు వితల చంద్రశేఖర్, భారతి వెంకట్రావు, గుడివాక మోహన్, మధ్యాహ్నపు నాని, గుబిలి సురేష్, కాత్రు మాధవ్, తూము అబ్బయ, రాళ్ళపల్లి రవి ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	05-07
బెండకాయలు	30	కంద	48
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	34-36	కీరా దోస	32
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	50	అల్లం	130
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	00
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణీ	60
ఆనబకాయ (1)	10-12	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	32

హెచ్‌ఎంలను బాధ్యులు చేయడం తగదు



ప్రధానోపాధ్యాయుల సంఘం సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన మన బడి నాడు – నేడు కార్యక్రమంలో తలెత్తే సమస్యలకు ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేయడం తగదని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు డీవీ రమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వేసవి సెలవుల ప్రారంభం లోగానే ఉన్నత పాఠశాలలకు రాత్రి కాపలాదారులను ప్రభుత్వం నియమించాలని కోరారు. ప్రతి పాఠశాలకు కంప్యూటర్ ఆపరేటర్, బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. పాఠశాలలకు ఇప్పటివరకు 20 శాతం నిధులను మాత్రమే విడుదల చేశారని, మిగిలిన నిధులను పూర్తిస్థాయిలో వెంటనే విడుదల చేయాలని కోరారు. పాఠశాలల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదు బాక్స్‌లను ప్రధానోపాధ్యాయులు లేక ఉపాధ్యాయులు మండల కార్యాలయాలకు తీసుకువెళ్లడం వంటి చర్యలను నిలుపుదల చేయాలని కోరారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, వచ్చే సంవత్సరానికి రాబోయే విద్యా కానుక అన్ని వస్తువులను పాఠశాలలకు దఫ దఫాలుగా కాకుండా ఒకేసారి అందించే ఏర్పాటు చేయాలన్నారు. సంఘ కార్యదర్శి ఏవీఎస్ఎన్ భాస్కర్, రాష్ట్ర కౌన్సిలర్లు వీ. విజయకుమార్, కే. సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పీవీ రామశర్మ, డివిజన్ అధ్యక్షుడు జీ ప్రకాష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత బాబ్జి మృతి

ఏలూరు రూరల్: ఏలూరు మండలం చాటపర్రు వైఎస్సార్ సీపీ నాయకుడు జాస్తి సత్యానందచౌదరి (బాబ్జి) (81) ఆదివారం సాయంత్రం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఐదురోజుల క్రితం చాటపర్రులోని సొంతింటిలో అస్వస్థకు గురయ్యారు. దీంతో బంధువులు ఆయన్ని విజయవాడకు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ కన్నుమూశారు. బాబ్జి ముక్కుసూటి మనిషిగా పేరు గడించారు. ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేవారు. ఆయన మృతిపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

హ్యాండ్ రైటింగ్‌లో శనివారపుపేట విద్యార్థుల ప్రతిభ



పి.జాహ్నవి



సర్టిఫికెట్లతో శనివారపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ఏలూరు రూరల్: శనివారపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.జాహ్నవి ఉత్తమ హ్యాండ్ రైటింగ్ అవార్డు సాధించిందని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.రాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల క్రితం పూనేకు చెందిన ఇంటర్నేషనల్ హ్యాండ్ రైటింగ్ ఒలింపియాడ్ ఆర్గనైజేషన్ ఆన్‌లైన్‌లో ఇంగ్లిష్ భాషలో నిర్వహించిన హ్యాండ్ రైటింగ్ పోటీల్లో తమ పాఠశాల పదో తరగతి విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. వీరిలో జాహ్నవి అద్భుత ప్రతిభ చాటి గోల్డ్‌మెడల్ దక్కించుకుందని, మిగిలిన వారిలో ఎ.ప్రత్యూష, కె.చరిష్మా, కె.తేజస్వి, ఎ.నాగరాజు, కె.హేమాంజలి, బి.అన్విత, బి.సైమన్‌మెస్సీ, కె.శ్యామూల్, ఎండీ రహాన్, ఎం.సుష్మ ప్రతిభ చాటి సర్టిఫికెట్లు, బహుమతులు పొందారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు ఎండీ ఇర్షాద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయుడు ఎ.సర్వేశ్వరరావు అభినందించారు.

అంబేడ్కర్ కొత్త విగ్రహం ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): నిడమర్రు మండలం పెదనింద్రకొలను జెడ్పీ హైస్కూల్‌లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని దుండగులు అపహరించడాన్ని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ నెల 13న హైస్కూల్‌లో విగ్రహాన్ని ఆవిష్కరించారని గుర్తు చేశారు. విగ్రహాలకు సంబంధించి ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ విడుదల చేసిన సర్క్యులర్‌ని అందరూ అనుసరించాలన్నారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్పందించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ వారిని కోరడంపై అభినందనలు తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాన్ని దొంగిలించిన స్థానంలో తక్షణమే మరో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఘటనలో దుండగులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని సంతోష్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కోర్టు సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఎంఆర్ పెదబాబు, సంఘం నాయకులు

ఏలూరు టౌన్: ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని కోర్టు సెంటర్ సమీపంలోని డ్రైవర్ల అసోసియేషన్ భవనం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలతో బాటసారులు, కార్మికుల దాహార్తిని తీర్చేందుకు సామాజిక బాధ్యతగా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. బాటసారులకు మజ్జిగ చలివేంద్రం ద్వారా ఎంతో ఉపశమనం లభిస్తుందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు దత్తి వేణు, మాజీ అధ్యక్షులు డీఎస్ కొండయ్య, సాల్మన్‌రాజు, వైజీఎల్ నారాయణ, ఆవుల రామారావు ఉన్నారు.

వ్యాయామంతో వ్యాధులు దూరం

గణపవరం : రోజూ కనీసం అరగంట సమయం నడక, వ్యాయామాలు చేస్తే ఆస్పత్రుల చుట్టూ తిరిగే అవసరం రాదని పలువురు వైద్యనిపుణులు సూచించారు. ఆదివారం గణపవరం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు పీఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. సదస్సులో జనరల్ వైద్య నిపుణుడు ఎస్‌వీ గోపాలరాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ఊబకాయం, బీపీ, షుగర్ వ్యాధులు ప్రాణాంతకంగా మారి గుండెపోటుకు దారితీస్తున్నాయని, నిత్యం కొంతసమయం వ్యాయామం చేస్తే వ్యాధులు దరిచేరవన్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిడమర్తి జయసూర్య మాట్లాడుతూ తమ సంఘం ద్వారా ప్రతి నెలా వైద్య నిపుణులతో ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, గణపవరం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.